క్లుప్తంగా

హాస్టళ్ల తనిఖీ



బాలికల ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: స్థానిక ఎస్సీ, బీసీ బాలబాలికల సంక్షేమ శాఖ హాస్టళ్లను మంగళవారం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లకు సూచించారు. ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు వడ్డించాలని, ఎప్పటికప్పుడు బియ్యాన్ని, ముడిసరుకులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరంగా చర్యలు తప్పవని డీవైఈఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన నగరంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టమంచిలోని మునిసిపల్ పాఠశాలలను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థుల సామర్థ్యాలు, టీచర్ల బోధనను పరిశీలించారు. అనంతరం కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పెట్టాలన్నారు. తర్వాత టీచర్లతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.

క్షయ బాధితులకు కిట్ల పంపిణీ



పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న వైద్యాధికారి

ఐరాల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ రీడ్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. వ్యాధి మొదటి దశలో గుర్తించి సరైన వైద్యంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కె.పట్నంలో 'ఫ్యామిలీ డాక్టర్'



కె.పట్నంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందం

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయ చౌదరి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న రామరాజు (30) అనే వ్యక్తిని చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బంగారుపాళ్యం మండలం చిల్లగుండ్లపల్లెలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు తమ సిబ్బందితో దాడులు చేశారు. గ్రామంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న రామరాజును అరెస్టు చేసి, 18 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

23న ఆండారెడ్డిపల్లెలో కబడ్డీ టోర్నీ

బంగారుపాళెం: మండలంలోని ఆండారెడ్డిపల్లెలో ఈ నెల 23న ఓపెన్ టు ఆల్ కబడ్డీ టోర్నీ ఏఆర్‌పీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనదలచిన జట్లు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రవేశ రుసుం 500 రూపాయలు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.11,116, రూ.5,116, రూ 3,116 నగదు ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 8555041099, 9398401735 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్లతో కలసి ప్రతి గడపకు తీసుకెళ్లి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వారికి గుర్తు చేస్తామని సోషల్ మీడియా కన్వీనర్లుగా నియమితులైన కన్వీనర్లు వైఎం వెంకటేష్, ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మాట్లాడారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి



చిత్తూరులో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి

చిత్తూరు రూరల్: వ్యాయామాన్ని విధిగా అలవాటు చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి అన్నారు. చిత్తూరు నగరం సత్యనారాయణపురం అర్బన్‌హెల్త్ సెంటర్ వద్ద సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రోజూ సైకిల్ తొక్కితే శరీరం తేలిగ్గా ఉంటుందని, స్థూలకాయం తగ్గుతుందని, ఆరోగ్య సమస్యలు ఏవీ ఉత్పన్నం కావన్నారు. శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి సైక్లింగ్ ఒక సాధనంగా దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావ్, సుదర్శన్, లోకేష్, రమేష్‌రెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు.

ఐరాల: సైక్లింగ్ చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఎలాంటి రుగ్మతలూ దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ ఆధ్వర్యంలో సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి రోజూ సైక్లింగ్ చేస్తే జీవక్రియ రేటు పెరిగి, శరీర కొవ్వుని తగ్గించేలా చేస్తుందన్నారు. సైకిల్ తొక్కడం వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ బాగా ఉంటుందని, అలాగే గుండె కండరాలు బలంగా ఉంటాయన్నారు. సైక్లింగ్ వల్ల టైప్ 2 మధుమేహం దూరమవుతుందని పేర్కొన్నారు. అనంతరం 'సైక్లింగ్ చేద్దాం..అధిక కేలరీలను కరిగిద్దాం' అనే నినాదంతో విద్యార్థులతో సైక్లింగ్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూర్ణలత, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని పూతలపట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి ఆమె మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పూతలపట్టు : హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లెలో..

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ వ్యాధులకు దూరంగా ఉండాలంటే యోగా, వ్యాయామాలు చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని కె.పట్నం, గాజులపల్లెలో విద్యార్థులతో కలిసి ఆయన సైక్లింగ్, యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సైక్లింగ్ చేస్తే క్యాన్సర్‌ను ఓడించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, జయమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఐరాల : విద్యార్థులతో కలిసి సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తవణంపల్లె : కె.పట్నంలో..

గడువులోపు ఇళ్ల నిర్మాణం



చిత్తూరు అర్బన్ : వైఎస్సార్ జగనన్న కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ అరుణ

- నగర కమిషనర్ అరుణ ఆదేశం

చిత్తూరు అర్బన్: నిర్దేశిత గడువులోపు జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని నగర కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ అనుపల్లె హౌసింగ్ కాలనీలో పర్యటించారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయి? మార్చి 15 నాటికి పూర్తి చేయాల్సిన నిర్మాణాల్లో పురోగతి తదితర అంశాలపై అమినిటీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. బీఎల్ స్టేజిలో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయాలని, గడువు సమీపిస్తున్న తరుణంలో లబ్ధిదారులు, మేస్త్రీల సమన్వయంతో పనులు వేగవంతం చేయించాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీడియో సమావేశం ద్వారా బండపల్లె, దొడ్డిపల్లె, తేనబండ, మంగసముద్రం హౌసింగ్ కాలనీల ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, సూపర్‌వైజర్లు, అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ శ్రీధర్, ఏఈ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ గౌరి సూచించారు. మంగళవారం మండలంలోని వడ్డేపల్లెలో జగనన్న లేఅవుట్లను ఆమె పరిశీలించారు. కొందరి నిర్లక్ష్యం వల్ల నిర్మాణ పనులు మందగించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు మండలంలో 702 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ ముఖ్యం

ఐరాల: చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని ఇరువారంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 76 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు, గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

సింహ, శేష వాహనాలపై శివపార్వతుల విహారం

యాదమరి: స్థానిక ఏకాంబరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో దేవదేవేరులు మంగళవారం ఉదయం సింహ, రాత్రి శేష వాహనాలలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేసి, సుగంధ పుష్పాలతో అలంకరించి, సింహ వాహనంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు కార్యక్రమంలో ఆలయ అర్చక వేద పండితులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై స్వామి వారు

పిల్లలను స్కూళ్లకు పంపే బాధ్యత తల్లిదండ్రులదే

బంగారుపాళెం: బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదేనని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. బడిబయట పిల్లలను గుర్తించేందుకు మంగళవారం మండలంలోని ఎగువ రాగిమానుపెంట గ్రామంలో సర్వే చేశారు. చదువు ప్రాధాన్యతపై ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, మండలంలో 6- 14 ఏళ్ల మధ్యగల బడిబయట పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేస్తున్నట్టు చెప్పారు. డ్రాపౌట్స్, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి బడికి వెళ్లని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పిల్లలను బడి మాన్పించి పనులకు పంపడం నేరమని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్వేను టీచర్లు, సీఆర్‌పీలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ తోట శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడిబయట పిల్లల తల్లిదండ్రులలో మాట్లాడుతున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలు తప్పనిసరి

చిత్తూరు అర్బన్: పరిశ్రమల్లో కార్మికుల రక్షణ కోసం చేసిన చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ ఆదేశించారు. నిర్బంధ వెట్టి చాకిరీ నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం చిత్తూరులోని గాజులపల్లె వద్ద పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను న్యాయమూర్తి పరిశీలించారు. అక్కడున్న ఫ్యాక్టరీల యాజమాన్యం, కార్మికులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఫ్యాక్టరీలోనూ కార్మికులకు పనిగంటలు పాటించాలన్నారు. పనులు చేసే చోట మౌలిక వసతులు కల్పించడంతో పాటు, రక్షణకు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రమాద సమయాల్లో ప్రాణాలకు కాపాడేందుకు తప్పనిసరిగా అవసరమైన పనిముట్లు కూడా ఫ్యాక్టరీల్లో ఉంచాలన్నారు. సమావేశంలో కార్మి కశాఖ సహాయ కమిషనర్ ఓంకార్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పునరుద్ధరించాలి

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి గతంలో వివిధ ప్రాంతాలకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం స్థానిక ఆర్టీసీ డీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు మాట్లాడుతూ గతంలో ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను పక్క డిపోలకు ఎందుకు పంపించారో చెప్పాలన్నారు. గతంలో పలమనేరు నుంచి ఉదయం పూట తిరుపతి, వేలూరుకు బస్సులుండేవన్నారు. దీంతో స్విమ్స్, రుయా, వేలూరు సీఎంసీలకు వెళ్లే రోగులకు అనుకూలంగా ఉండేదన్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు, విజయవాడకు నడుస్తున్న బస్సులను నష్టాలొస్తున్నాయని ఆపేశారన్నారు. అయితే ఇదే పలమనేరు నుంచి విజయవాడకు, హైదరాబాద్‌కు వెళుతున్న ప్రైవేటు బస్సులకు మాత్రం లాభాలు ఎలా వస్తున్నాయో ఆర్టీసీ అధికారు లు విచారించాలన్నారు. విన్నవించిన వారిలో దేవరాజులు,దొరస్వామి, సన్నీరాజు,నారాయణప్ప,రమణ ఉన్నారు.

బైజూస్ టీమ్ తనిఖీ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బైజూస్ రాష్ట్ర బృందం సభ్యులు సతీష్‌బాబు, తులసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. జగనన్న విద్యాదీవెన ద్వారా విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఎలా వాడుతున్నారని గమనించారు. ఇందుకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎం, టీచర్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ట్యాబ్ ద్వారానే ఎక్కువగా ప్రాక్టీస్ చేసేలా చూడాలన్నారు. పరీక్షలను సైతం ట్యాబ్స్ ద్వారానే నిర్వహించాలని సూచించారు. ట్యాబ్‌ల్లో ఏదేనా సమస్యలుంటే డీఈఓ కార్యాలయంలో సంప్రదించి, మార్చుకోవడం లేదా సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ లీలారాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భూములు ఇవ్వరూ!

చిత్తూరు రూరల్: ఏపీ లోకాయుక్త తీర్పు మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యామ్నాయ భూములను ఇవ్వాలని వి.కోట మండల మాల మహానాడు అధ్యక్షుడు మునిరత్నం విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 1973లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 73 మంది పేదలకు ప్రభుత్వం భూములు ఇచ్చిందన్నారు. అయితే గత ప్రభుత్వ పాలకులు ఆ భూములని స్వాధీనం చేసుకున్నారని, దీనిపై లోకాయుక్తను ఆశ్రయించగా తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు పేదలకు భూములను పంపిణీ చేయాలని కోరారు.

ఎంసీఎంసీ, హెల్ప్ డెస్క్ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ), హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పనిచేసేందుకు ప్రత్యేకంగా కమిటీ సభ్యులను నియమించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు కమిటీ సభ్యులు విధుల్లో ఉంటారని జిల్లా ఎన్నికల అధికారి హరి నారాయణన్ తెలిపారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ విభాగం ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం కూడా కొనసాగా యి. తమ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకుడు నాగరాజన్ మాట్లాడుతూ, పర్మినెంట్ కార్మికులకు సమానంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సైతం యూనిఫాం, నూనె, సబ్బులు, పాదరక్షలు ఇవ్వాలన్నారు. గతంలో ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం చేయలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుగుణ, వినాయక, రమణి, చిరంజీవి, బుల్లెమ్మ, ఈశ్వర్, సుకన్య, శోభన్‌బాబు, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

22, 23న అన్ డెలివరీ వస్తువుల వేలం

చిత్తూరు రూరల్: అన్ డెలివరీ వస్తువులను ఈ నెల 22 ,23 తేదీలలో ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు కార్గో నిర్వాహకులు కుమార్ తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని, వేలం పాడిన వారు అప్పటికప్పుడే నగదు వస్తువులను పొందాల్సి ఉంటుందన్నారు.

నేడు వాహనాల వేలం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పలు స్మగ్లింగ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తమ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వేలానికి వివిధ రకాల వాహనాలు 41 ఉన్నాయని చెప్పారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికే కృషి చేయండి

పుంగనూరు: వైఎస్సార్ సీపీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని పటిష్టం చేసేందుకు గృహసారథులు కృషి చేయాలని రాష్ట్రజానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం సూచించారు. మంగళవారం మున్సిపాలిటీలో గృహసారథుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము అతిథులుగా హాజరయ్యారు. నాగభూషణం మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు పార్టీలో క్రమశిక్షణగా పని చేసే వారికే గృహసారథులు, కన్వీనర్ల పదవులు ఇచ్చారన్నారు. 50 గృహాలకు సంబంధించి ఆయా గృహసారథులు పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ఇంట్లోని సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వైఎస్సార్ సీపీ ఆశయాలను వివరించి చైతన్య పరచాలన్నారు. పార్టీని పటిష్టం చేసేందుకు గృహసారథులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, వరదారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

మాదకద్రవ్యాలతో యువత జీవితం చిత్తు

కుప్పం: మాదక ద్రవ్యాలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్సిటీ ప్రాంగణంలో డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. విద్యార్థులు ఫ్యాషన్ కోసం సిగరెట్లు, మద్యం అలవాటు చేసుకుని, అనంతరం వాటికి బానిసలవుతున్నారని చెప్పారు. మాదక ద్రవ్యాలకు ఒకసారి అలవాటు పడితే జీవితాంతం వ్యసనాలకు బానిసై అనారోగ్యంతో క్షీణించాల్సి వస్తోందన్నారు. ఇలాంటి అలవాట్లుకు యువత దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లోకనాథం, యశోద, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వెట్టిచాకిరీ నిర్మూలనకు సహకరించండి

పుంగనూరు: సమాజంలో అనేక ప్రాంతాల్లో పలువురు వెట్టిచాకిరీకి గురవుతున్నారని, వారికి విముక్తి కల్పించి, ఆ వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీలో వెట్టిచాకిరీ నిర్మూలనపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ అమాయకులైన ప్రజలు తమ అవసరాల కోసం చేసిన అప్పులను తీర్చలేక ధనికుల వద్ద వెట్టిచాకిరికి చేస్తున్నారన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన వారి పిల్లలు కూడా వెట్టిచాకిరీకి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా అవసరాలకు కోసం అప్పులు చేసి , ఖాళీ ప్రామిసరీ నోట్లలో సంతకాలు చేయకూడదన్నారు. తీసుకున్న మొత్తాన్ని అందులో నమోదు చేసి ,ప్రామిసరీ నోట్లలో సంతకాలు చేయాలని సూచించారు. అలాగే ఇటుక బటీలు, ఫ్యాక్టరీల్లో ఎంతో మంది కార్మికులు వెట్టిచాకిరీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, న్యాయవాది వీరమోహన్‌రెడ్డి , మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

అన్వేషణ్ ప్రాజెక్టు-23లో పలమనేరు విద్యార్థుల ప్రతిభ

పలమనేరు: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సైనోస్పెస్ కంపెనీ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అన్వేషణ్-2023లో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో పలమనేరు విద్యార్థులు శైలశ్రీ , గీత, జయశ్రీ , లోహిత్ ప్రతిభ కనబరిచారు. వీరు జోనల్ స్థాయిలో రెండో స్థానం, జాతీయస్థాయిలో ఐదో స్థానంలో నిలిచినట్టు మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు రవీంద్రబాబు తెలిపారు. కంప్యూటర్ మౌస్‌ను ఉపయోగించకుండా కేవలం చేతిలో గుర్తులతో కంప్యూటర్‌ను వాడడం వర్చువల్ మౌస్ సిస్టం ప్రాజెక్టును వీరు ప్రదర్శించి అవార్డు అందుకున్నారు. మరో వైపు గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షిత, మనిత సైతం ఈ ప్రాజెక్టులో సహాయకులుగా పనిచేసి ప్రతిభను చాటారు. దీంతో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ అడ్వైజర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు శ్రీరామమూర్తి, కుసుమలు స్థానిక కళాశాలలో విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు